క్లుప్తంగా

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



పాలువాయి జంక్షన్ (రెంటచింతల): మండలంలోని పాలువాయి జంక్షన్ వద్ద నున్న షిరిడీ సాయి ఆలయంలో గురువారం అర్చకులు గోపాల్ పాండే ఆధ్వర్యంలో సాయి బాబాకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు. ఇక్కడి ఎంతో మహిమ కలిగిన సాయి బాబాని పూజిస్తే తమ కోరికలు నెరవేరుతాయని పల్నాడు ప్రాంతంలోని అనేక గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని సాయినాథునికి మొక్కులు చెల్లించుకున్నారు. భజన బృందం బాబా గీతాలను ఆలపించారు. దుర్గి గ్రామానికి చెందిన మల్లెమారపు కోటేశ్వరరావు, కోటమ్మ దంపతులు, కొలగొట్ల గ్రామానికి చెందిన ఉన్నం వెంకటేశ్వర్లు, పద్మావతి దంపతులు అన్న ప్రసాద వితరణ చేశారు. భక్తులకు ఆలయ చైర్మన్ పందిరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

శివారు ప్రాంతాల్లో చెట్లు పెరగకుండా చూడాలి

మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్



పిడుగురాళ్ల: పట్టణ శివారు ప్రాంతాల్లో చెట్లు పెరగకుండా పారిశుద్ధ్య కార్మికులు చూడాలని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ అన్నారు. పట్టణంలోని గురువారం శివారు కాలనీల్లో పిచ్చి మొక్కల తొలగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పక్కన ఖాళీ ప్రదేశాలు ఉంటే వారికి తెలియజేసి పిచ్చి మొక్కలను తొలగింపజేసేలా చూడాలన్నారు. వారు వినని పక్షంలో మున్సిపల్ సిబ్బందికి తెలియజేస్తే వారు తొలగింపజేయిస్తారని ఆయన తెలిపారు. అనంతరం మున్సిపల్ సిబ్బందితో మాట్లాడుతూ సిబ్బంది కూడా నిష్పక్షపాతంగా వ్యవహరించి పిచ్చి మొక్కలు లేకుండా చూడాలని, వీటి వలన దోమలు వ్యాప్తి చెంది ప్రజలు అనారోగ్యం బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



పిడుగురాళ్ల: ప్రపంచ ఊపిరితిత్తుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని శ్రీ దత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారు నిర్వహిస్తున్న ఊపిరితిత్తుల ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. బుధవారం ప్రారంభమైన ఈ శిబిరం గురువారం రెండవ రోజుకు చేరుకుంది. ఈ శిబిరంలో ఊపిరితిత్తుల వ్యాధులు కలిగిన వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ పి.మహేశ్వరరావు వైద్య సేవలు అందించారు. పిడుగురాళ్ల, పరిసర ప్రాంతాలలో కార్మికులు ఎక్కువగా ఉండటంతో వారి సంక్షేమం దృష్ట్యా హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ గార్లపాటి జ్ఞానేశ్వరి ఆదేశాల మేరకు ఈ క్యాంపు మూడు రోజుల పాటు నిర్వహించటం జరుగుతుందని, శుక్రవారం కూడా కొనసాగుతుందని హాస్పిటల్ మేనేజర్ ఎ.కృష్ణప్రసాద్ తెలిపారు. రూ.1,000 విలువ చేసే ఊపిరితిత్తుల పనితీరు తెలియజేసే పరీక్ష ఉచితంగా చేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించండి



మాచర్ల: ప్రతి గ్రామంలో పనిలేని ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులను కల్పించటంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, మేట్లు కీలక పాత్ర వహించాలని గురజాల క్లస్టర్ మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ ప్రాజెక్టు డైరెక్టర్ కె.మల్లికార్జునరావు, మాచర్ల మండల అధికారి నాగ శ్రీనివాసరావులు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో వారు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 365 రోజులు ఉపాధి లేని ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత గ్రామీణ ప్రాంతంలోని ఫీల్డ్ అసిస్టెంట్లపై ఉందన్నారు. ఎక్కడా రాజీ పడకుండా చర్యలు తీసుకొని ముందుకు వెళ్లాలన్నారు. ఏ ఏ ప్రాంతాలలో ప్రణాళికలు సిద్ధం చేశారు.. పనుల నిర్వహణ, ఉపాధి పనులు సక్రమంగా జరుగుతున్నయా లేదా అనే అంశంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు టెక్నికల్ అసిస్టెంట్లు, సీఓలు తదితరులు పాల్గొన్నారు.



పిడుగురాళ్లలోని గిరిజన గురుకుల పాఠశాలలో విద్యుత్ సౌకర్యం లేని బాత్‌రూమ్‌లు





పిడుగురాళ్లలోని గిరిజన గురుకుల పాఠశాల పడిపోయిన ప్రహరీగోడ

వసతులు కరువైన సంక్షేమ హాస్టళ్లు

- వసతి గృహాల్లో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- ఆహార నాణ్యత అంతంత మాత్రమే
- అద్దె ఇళ్లలో సౌకర్యాల లేమితో విద్యార్థులు సతమతం
- విద్యుత్ లైట్లు లేని మరుగుదొడ్లు.. ఫ్యాన్లు లేని గదులు



కింద కూర్చునే చదువుకుంటున్న విద్యార్థులు



ఫ్యాన్ లేని వసతి గది

సాక్షి విజిట్ — సాక్షి — క్షేత్ర స్థాయి

గురజాల: భవిష్యత్తుకు బాటలు వేసుకునేందుకు వచ్చిన బాలలు వారు. అమ్మానాన్నలకు దూరంగా ఉంటున్న నిరుపేద విద్యార్థులు వారు. వసతి గృహాలే వారికి ఆదరువు. అయితే కనీస వసతులు లేమి.. ఇరుకు గదులు.. అపరిశుభ్రత.. నాణ్యతలేని ఆహారం.. దోమల బెడద.. నీటి వసతి లేని మరుగుదొడ్లతో కునారిల్లుతున్నారు. సంక్షేమం కరువై.. ఆదరణ బరువై బతుకు భారంగా గడుపుతున్నారు. ఇదీ ప్రభుత్వ హాస్టళ్ల దుస్థితి.

చన్నీటి స్నానం... దోమలతో సహవాసం

గురజాల నియోజకవర్గంలోని పిడుగురాళ్ల, మాచవరం, దాచేపల్లి, గురజాల మండలంలో 11 ప్రభుత్వ హాస్టళ్లు ఉన్నాయి. వాటిలో ఎస్సీ హాస్టళ్లు 3, ఎస్టీ హాస్టళ్లు 2, బీసీ హాస్టళ్లు 6 ఉన్నాయి. వాటిల్లో పరిశుభ్రత నామమాత్రంగా మారింది. ఈ హాస్టళ్లలో చన్నీటి స్నానంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే గదుల పక్కనే తిని పడేసిన వ్యర్థాలు ఉండటంతో ఆ ప్రాంతంలో దోమలు ఉధృతి పెరిగింది.

నాసిరకం కూరగాయలతో ఆహారం

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించడం లేదు. మరొక వైపు ధరలు అధికంగా పెరిగిపోవడంతో నాసిరకం కూరగాయాలను వినియోగిస్తున్నారు. దీనితో రోగాల బారిన పడతారనే ఆందోళన విద్యార్థుల తల్లిదండ్రుల్లో నెలకొంది. పలువురు తల్లిదండ్రులు హాస్టల్ వార్డెన్‌కు మొర పెట్టుకున్నా ప్రయోజనం లేదు.

చలికి వణుకుతున్న విద్యార్థులు

దుప్పట్లు ఈ ఏడాది విద్యార్థులకు పంపిణీ చేయలేదు. దీంతో విద్యార్థులు చలికి వణుకుతున్నారు. గతంలో దుప్పట్లు పంపిణీ చేశారు. కానీ అవి చిరిగిపోవడంతో కొంత మంది విద్యార్థులు దుప్పట్లు లేక పడుకోవాల్సి వస్తుంది. కొంత మంది విద్యార్థులు కిందనే పడుకుంటున్నారు. అసలే చలికాలం కావడంతో విద్యార్థులు అల్లాడిపోతున్నారు. అధికారులు స్పందించి ఇప్పటికైనా హాస్టల్ విద్యార్థులపై జాలి చూపి వారికి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.

చాలీచాలని ఇరుకు గదులు

కారెంపూడి: కారెంపూడిలో బీసీ బాలుర వసతి గృహం 1982 నుంచి దాదాపు 42 ఏళ్లగా అద్దె ఇళ్లలోనే కొనసాగుతుండడంతో విద్యార్థులు చాలీచాలని సౌకర్యాలతో ఇబ్బందులు పడుతున్నారు. అద్దెకు దొరికే ఇళ్లు హాస్టల్ కోసం నిర్మించరు కనుక అక్కడ టాయిలెట్స్ సమస్య, అలాగే ప్రత్యేకంగా రూమ్‌లు, భోజన శాల, వంట శాలలు ఉండడం లేదు. ఇప్పుడు కొనసాగుతున్న హాస్టల్‌లో కూడా అలాంటి సమస్యలే కన్పిస్తున్నాయి. ఇదిలా ఉంటే కారెంపూడితో పాటు, దుర్గి, రెంటచింతలలో కూడా బీసీ బాలుర వసతి గృహాలకు సొంత భవనాలు లేవు. అలాగే మాచర్లలో కాలేజి విద్యార్థుల కోసం రెండు బీసీ హాస్టళ్లను 2018లో ఏర్పాటు చేశారు. కానీ వాటికి కూడా సొంత భవనాలు లేవు. నెలకు రూ.లక్షల్లో అద్దెలు చెల్లిస్తున్నా విద్యార్థులు మాత్రం చాలీచాలని వసతితో ఇబ్బందులు పడుతున్నారు. కారెంపూడి ఎస్టీ హాస్టల్‌ను గురుకులంగా మార్చిన తర్వాత విద్యార్థులు సమస్యలను ఎదుర్కొంటున్నారు. నివాస గదులనే క్లాస్ రూమ్‌లుగా వాడుకుంటున్నారు. రూ.5 కోట్లతో ఎస్టీ బాలుర వసతి భవన నిర్మాణం జరుగుతోంది. అది పూర్తయితే సమస్య తీరుతుంది. అలాగే ఎస్టీ బాలికల గురుకులం ఆవరణ మరింత పరిశుభ్రంగా ఉంచాల్సిన అవసరం కన్పిస్తోంది. అన్ని చోట్లా టాయిలెట్స్ మరమ్మతులు చేయాల్సి ఉంది. అలాగే కొన్ని చోట్ల రక్షిత మంచినీరు లభ్యత లేదు. వసతి సమస్య చదువుపై పడి విద్యార్థులు నష్టపోతున్నారు. స్టడీ అవర్స్ నిర్వహణకు మంచి ప్రశాంత వాతావరణం కన్పించడం లేదు. ముఖ్యంగా బీసీ విద్యార్థులు దాదాపు 42 ఏళ్లుగా ఇలాంటి సమస్యలనే ఎదుర్కొంటున్న పరిస్థితి. విద్యార్థులంతా కిందే నిద్రించాల్సి రావడం, చదువుకోడానికి బల్లలు కుర్చీలు లేక పోవడం లాంటి సౌకర్యాలను కల్పించాల్సిన పరిస్థితిపై ఆలోచన చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

కంపు కొడుతున్న మరుగుదొడ్లు

మరుగుదొడ్లు కంపు కొడుతున్నాయి. దీంతో విద్యార్థులకు తిప్పలు తప్పటం లేదు. బాత్‌రూమ్‌లోకి వెళితే నీరుపోసేందుకు నీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఆరు బయట స్నానాలు చేస్తున్నారు. పిడుగురాళ్లలోని గురుకుల పాఠశాలలో ప్రహరీ గోడ పడిపోవడంతో పాములు, గేదెలు వస్తున్నాయి. చలికాలం కావడంతో తేళ్లు, కాళ్లజెర్రెలు హాస్టల్ గదుల్లోకి వస్తున్నాయని విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. పక్కనే శ్మశానం ఉండటంతో రాత్రివేళ విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. మరుగుదొడ్లలో విద్యుత్ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు అంటున్నారు.

నేడు డయల్ యువర్ డీఎం



మాచర్ల: మాచర్ల ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ప్రయాణికుల అభిప్రాయాలు, సలహాలు, సూచనలు తెలుసుకునేందుకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిపో పరిధిలో ప్రయాణికులు, ప్రజలు, ఆయా గ్రామాలకు సంబంధించిన వారు తమ సమస్యలను తెలియపరచటంతో పాటు సలహాలివ్వచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డయల్ యువర్ 9959225432 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

విద్యార్థులు వైఫల్యాలను అధిగమించాలి



పిడుగురాళ్ల: విద్యార్థులు విద్యార్థి దశలోనే సరైన నడవడికను అవలంబించాలని మోటివేటర్ మాదిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వివేకానంద స్కూల్‌లో మోటివేషన్ క్లాస్‌లను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తనకు పట్టు ఉన్న రంగాన్ని ఎంచుకొని అందులో పరిపూర్ణత సాధించాలని, ఆ ప్రయత్నంలో ఒక్కోసారి విఫలమైనా నిరాసర చెందకుండా ఆ వైఫల్యం నుంచి పాఠం నేర్చుకొని ముందుకు సాగాలన్నారు. నైతిక విలువలకు కట్టుబడి ఉంటేనే విలువలు పెరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అనుమతిలేని బయోమందులను విక్రయిస్తే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న ఏవో బోయపాటి బ్రహ్మారెడ్డి

రెంటచింతల: ప్రభుత్వ అనుమతిలేని బయోమందులను విక్రయించడం చట్టరీత్యా నేరమని ఆ మందులను విక్రయించిన వారిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి హెచ్చరించారు. గురువారం మండలంలోని రెంటచింతలలో నున్న ఎరువులు, పురుగు మందుల షాపులలో ఆయన ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి, అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎరువులు, పురుగు మందుల షాపుల నిర్వాహకులు ఎంఆర్పీ ధరలకే ఎరువులు, పురుగు మందులను రైతులకు విక్రయించాలన్నారు. ప్రతి పురుగు మందుల షాపులో ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్ (కాటా)తప్పనిసరిగా ఉండాలని, బయోమెట్రిక్, ఈ పోస్ విధానం ద్వారానే ఎరువులను విక్రయించాలన్నారు. పురుగు మందుల కంపెనీల సీసీలు డీలర్ షాపులో ఉంచుకోవాలని, ఎరువులకు సంబంధించి ఓ ఫారం కలిగి ఉండాలని సూచించారు. స్టాక్, క్రయ, విక్రయాలకు సంబంధించిన రిజిస్టర్‌లు ఎప్పటికప్పుడు అప్‌డేట్ ఉండేలా చూసుకోవాలన్నారు. నాసిరకం, అనుమతిలేని పురుగు మందులను రైతులకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కచ్చితంగా ఎరువుల గోదాం వద్ద షాపు పేరు, డోరు నంబరు ఉండేలా చూడాలన్నారు.

మరుగుదొడ్ల వినియోగం బాధ్యత



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆయుర్వేద వైద్యులు శ్రీనివాస్

బెల్లంకొండ: మరుగుదొడ్లను వినియోగించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని మండల ఆయుర్వేద వైద్యులు ఆర్.శ్రీనివాస్ తెలిపారు. ప్రపంచ మరుగుదొడ్ల వారోత్సవాలలో భాగంగా గురువారం మండల కేంద్రమైన బెల్లంకొండ బుడగ జంగాల కాలనీలో స్థానిక ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బహిరంగ మల మూత్ర విసర్జన చేయడం వల్ల ఎన్నో ఆరోగ్య అనర్థాలు సంభవిస్తాయని తెలిపారు. బహిరంగ మల విసర్జన ఒక సామాజిక దురాచారం వంటిదని, కోట్ల సంఖ్యలో వైరస్‌లు, బ్యాక్టీరియాలు వ్యాప్తి చెందుతాయని పేర్కొన్నారు. డయేరియా, టైఫాయిడ్, కలరా వంటి వ్యాధులు బహిరంగ మలవిసర్జన ద్వారా సంక్రమించేందుకు ఆస్కారం ఉందని తెలిపారు. అనంతరం కాలనీ వాసులతో మరుగుదొడ్లను వినియోగిస్తామని, బాధ్యత గల పౌరులుగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎం ఎల్ హెచ్ పి సునీత, ఏఎన్ఎం మధులత, దుగ్గి సామేలు, గంధం నారాయణ, ఆయుష్ సిబ్బంది వెంకటరామయ్య పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న వలంటీర్ బాబూరావు

రాజుపాలెం: విద్యార్థులు మారక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పారా లీగల్ వలంటీర్ కోటా బాబూరావు తెలిపారు. కోట నెమలిపురి గ్రామ పరిధిలోని విద్యార్థులకు జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సదస్సులో పారా లీగల్ వలంటీర్ మాట్లాడుతూ చదుకునే రోజుల్లో మత్తు పదార్థాలకు బానిసైతే జీవితాలు నాశనమవుతాయని హెచ్చరించారు. నేటి విద్యార్థులే రేపటి భావిభారత పౌరులని, దేశ భవిషత్ బాగుండాలంటే యువత వ్యసనాలకు లోను కాకుండా చక్కగా చదువుకోవాలని సూచించారు. చిన్నచిన్న విషయాలకు క్షణికావేశంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సురేష్‌కుమార్, ప్రిన్సిపల్ వినయలక్ష్మి, నేషనల్ యాంటీ క్రైమ్ అండ్ హ్యూమన్ రైట్స్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు గరికపాటి శంకరరావు, కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, మూర్తి, మేరి పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య

దాచేపల్లి: వ్యక్తిగత కారణాల నేపథ్యంలో యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం జరిగింది. దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని నారాయణపురంకు చెందిన జి.ఆంజనేయులు కుమార్తె అంజలి (21) కిరోసిన్ పోసుకుని నిప్పంటించకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వ్యక్తిగత కారణాల నేపథ్యంలో అంజలి నడికుడి రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే ట్రాక్ వద్ద ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. స్థానికులు పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం నరసరావుపేట తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందింది. ఎస్సై జి.పాపారావు కేసు నమోదు చేసి అంజలి ఆత్మహత్యకు పాల్పడడానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. అంజలికి వివాహం కాలేదు.

బస్సు నుంచి పడి మహిళకు గాయాలు

సత్తెనపల్లి: ఆర్టీసీ బస్సులో నుంచి పడి వృద్ధురాలికి గాయాలైన ఘటన సత్తెనపల్లి మండలం నందిగామ ఎస్సీ కాలనీ వద్ద ఉన్న మలుపులో గురువారం జరిగింది. సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామానికి చెందిన లింగిశెట్టి సీతారావమ్మ సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామం నందు అమరావతి నుంచి సత్తెనపల్లి వెళుతున్న ఆర్టీసీ బస్సు ఎక్కింది. నందిగామ ఎస్సీ కాలనీ వద్ద ఉన్న మూలమలుపులో ఆర్టీసీ బస్సులో నుండి ఆమె బయటపడటంతో గాయాలయ్యాయి. హుటాహుటిన అత్యవసర చికిత్స కోసం ఆమెను సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనతో గ్రామస్తులు కోపోద్రికులయ్యారు. ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా చూడాలని గ్రామస్తులు కోరారు.

24న యాదవ కార్తిక వనసమారాధన

మాచర్ల: అఖిలభారత యాదవ మహాసభ మాచర్ల నియోజకవర్గం సంఘం ఆధ్వర్యంలో 7వ యాదవ కార్తిక వన సమారాధన మహోత్సవం కార్యక్రమాన్ని ఈ నెల 24వ తేదీ ఆదివారం నిర్వహించనున్నట్లు యాదవ మహాసభ కార్యవర్గ నిర్వాహకుడు గురువారం తెలిపారు. సాగర్ రోడ్డులోని ఆర్టీసీ డిపో ఎదురుగా నిర్వహించే ఈ వన సమారాధన మహోత్సవానికి ప్రతి ఒక్క యాదవులు విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్లు చేసేందుకు యాదవులంతా కదలి రావాలన్నారు. మరిన్ని వివరాలకు 9618030603, 9908197630, 9949747485 నెంబర్లను సంప్రదించాలన్నారు.

వృత్తి విద్య శిక్షణ



దుర్గి: వ్యాపార అవగాహన కోసం ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా గుణ సూపర్ మార్కెట్‌ని గురువారం విద్యార్థులు సందర్శించటం జరిగిందని జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం కోటేశ్వరమ్మ, ఇన్‌చార్జి మల్లికార్జున పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జెడ్పీహెచ్ఎస్ వృత్తి విద్యా కోర్సు రిటైల్ ట్రేడ్‌లో 9, 10 తరగతుల విద్యార్థులకు శిక్షణ నిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విజిట్‌లో విద్యార్థులకు అమ్మకాలు, కస్టమర్ సర్వీసుల గురించి తెలిపారు. 10వ తరగతి బోర్డు నుంచి రిటైల్ సర్టిఫికెట్ వస్తుందన్నారు. దీంతో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలను మెరుగుగా ఉంటాయన్నారు. హనుమంతరావు, గంగిరాజు, కృష్ణయ్య, చక్రపాణి పాల్గొన్నారు.

స్వాములకు సద్ది వితరణ

రెంటచింతల: స్థానిక శివాలయం ఆవరణలోని అయ్యప్ప సేవా సమితి మండపంలో గురువారం హోమాలు, స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాలువాయి గ్రామానికి చెందిన తేలుకుట్ల లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులు స్వాములకు సద్ది ఏర్పాటు చేశారు. శివాలయం అధ్యక్షులు పల్లెర్ల లక్ష్మారెడ్డి, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. గత 19 సంవత్సరాల నుంచి 51 రోజుల పాటు మాలధారులకు సద్ది కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప సేవా సమితి కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రత్యేక పూజలు.. హోమాలు



సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద వేంచేసిన అతి పురాతన శైవక్షేత్రం గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి దేవస్థానంలో కార్తిక మాసం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు, హోమాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన అనేక ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అర్చకులు చిట్టేల మల్లిఖార్జునశర్మ నేతృత్వంలో స్వామి, అమ్మవార్లకు పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. పరాశక్తి పవర్‌ప్లాంట్ డిపార్ట్‌మెంట్ సత్రశాల వారు, విశ్రాంత ఎస్పీ బాణావత్ చాంద్‌నాయక్, పద్మావతి దంపతులు, ఏపీ జెన్‌కో ఏడీ భక్తులకు, మాలధారులకు అన్నదానం చేయగా ఈఓ గాదె రామిరెడ్డి, కమిటీ సభ్యులు గొట్టం శ్రీనివాసరెడ్డి, మున్నా ప్రభురాజు, నీలం మల్లయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అటవీయేతర ప్రాంతాల్లో మొక్కలు పెంపకం



మాట్లాడుతున్న మారపల్లి ప్రణీత్ వర్మ

సత్తెనపల్లి: అటవీయేతర ప్రాంతాల్లో చెట్ల పెంపక చేపట్టాలని ట్రీస్ ఔట్‌సైడ్ ఫారెస్ట్ ఇన్ ఇండియా (టీఓఎఫ్ఐ) ప్రోగ్రాం రాష్ట్ర అసోసియేట్ మారపల్లి ప్రణీత్ వర్మ అన్నారు. సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామంలో గురువారం రైతులకు నిర్వహించిన అవగాహన, శిక్షణ సదస్సులో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రణీత్ వర్మ మాట్లాడుతూ రైతులకు అగ్రో ఫారెస్ట్రీ మీద అవగాహన, శిక్షణ సదస్సులో ఉద్యాన మొక్కలు, అడవి జాతి మొక్కలను వ్యవసాయ భూమిలో నాటితే దాని వల్ల వచ్చే ఉపయోగాలను, అదనపు ఆదాయం గురించి రైతులకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుడిపూడి సర్పంచ్ తౌరటి తిరుపతయ్య పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం హామీలు నేరవేర్చాలి



మాట్లాడుతున్న కార్యదర్శి శ్రీనివాసరావు

అమరావతి: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని పెదకూరపాడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మున్నగోటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం అమరావతి మండల సీపీఐ కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఈ సమావేశానికి బి.వేదాంతం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలాలిచ్చి, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు కేటాయించాలన్నారు. సీపీఐ ఏరియా నాయకులు శరణం విజయ మాట్లాడుతూ..భవన నిర్మాణ కార్మికులు నిత్యం ఉపాధి పొందేందుకు.. ఇసుక రీచ్‌లన్నింటిని వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బైరా పట్నం రామకష్ణ,, మండల కార్యదర్శి చెన్నకేశవరావు, ఆవుల కొటేశ్వరరావు, రవి, విశ్వనాథ యుగంధర్, ముని పాల్గొన్నారు.

ప్రకృతి సిద్ధమైన ఎరువులు వాడాలి

సత్తెనపల్లి: పంటల సాగులో రసాయన ఎరువులతో పాటు సేంద్రియ ఎరువులనూ వాడాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి ప్రవీణ్ అన్నారు. పట్టణంలోని అగ్రీ టెస్టింగ్ ల్యాబ్‌లో సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి, పెదకూరపాడు, ముప్పాళ్ళ మండలాల వీఏఏలు, వీహెచ్ఏలు, బహుళ ప్రయోజన విస్తరణ అధికారుల క్షేత్ర స్థాయి నైపుణ్యాభివృద్ధికి శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథి ప్రవీణ్ మాట్లాడుతూ ద్రవ, ఘన జీవామృతం వాడుకొని భూమిని సారవంతం చేయాలని సూచించారు. నీమాస్త్రం, అగ్ని అస్త్రం, పంచగవ్య వంటి ప్రకృతి సిద్ధమైన ద్రవకాలు వాడుకోవాలని పేర్కొన్నారు. పెదకూరపాడు ఏఓ ఐ.శాంతి మాట్లాడుతూ శనగ పంటలో తెగుళ్ల నివారణ చర్యలు తెలిపారు. సత్తెనపల్లి ఏడీఏ ఎస్.శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ స్థాయి అధికారులు నేర్చుకున్న ప్రతి అంశం రైతులకు వివరించాలని స్పష్టం చేశారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా జిల్లాలో రబీ సీజన్‌కు వరి పంట బీమాను డిసెంబర్–31 లో చేయించాలన్నారు. ఎకరాకు రూ.630 రైతు వాటా ప్రీమియం చెల్లించాలని చెప్పారు. ముప్పాళ్ళ ఏఓ ఎం.అరుణ పాల్గొన్నారు.

రోటరీ ఉత్తమ ప్రెసిడెంట్ వనమా

సత్తెనపల్లి: వాసవి మణికంఠ క్లబ్ అధ్యక్షుడు వనమా నాగేశ్వరావు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఉత్తమ అధ్యక్షుడిగా గవర్నర్ కొలిశెట్టి శివ సుబ్రహ్మణ్యం నుంచి గురువారం అవార్డును అందుకున్నారు. చిలకలూరిపేటలో జరిగిన మెగా డిస్కాన్‌లో అవార్డు ప్రదానం చేశారు. వనమా నాగేశ్వరావును వాసవి మణికంఠ క్లబ్ సెక్రటరీ పెండ్యాల సాంబశివరావు, ట్రెజరర్ సూరె శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ అను మాలశెట్టి వెంకటేశ్వరరావు, జిల్లా ఆఫీసర్ కొప్పురావూరి కాశీ వెంకట సుబ్బారావు, రోటరీ క్లబ్ జోనల్ చైర్మన్ బెల్లంకొండ నాగసాయి ప్రసాద్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు మాతంగి సాంబశివరావు, డైరెక్టర్ సరికొండ రమాదేవి, లేళ్ల అయోధ్య కృష్ణ అభినందించారు.